ఈనాడు ఒడిశా


ఉద్యోగులకు తీపి కబురు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: మోహన్‌చరణ్‌మాఝి ప్రభుత్వం దసరా వేడుక సమయంలో ఉద్యోగులకు తీపి కబురు చెప్పింది. వారి గ్రాట్యుటీ మొత్తం రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచింది. ఈ ఏడాది జనవరి 1 నుంచి ఈ పెంపును అమల్లోకి తెచ్చినట్లు సాధారణ పాలనా విభాగం(జీఏ) అధికారవర్గాలు మంగళవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపాయి.

10 జిల్లాల్లో 'గ్రామోదయ'

కార్యక్రమాల అమలుకు పర్యవేక్షక సంఘాలు

583 గ్రామాలకు లబ్ధి


గ్రామోదయ అధ్యక్షుడు మనోజ్ అహుజా

భువనేశ్వర్, రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: న్యూస్‌టుడే: మావోయిస్టు కార్యకలాపాలను పూర్తిగా నియంత్రించాలని, 2026 మార్చి నాటికిది నెరవేరాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రులకు దిశా నిర్దేశం చేశారు. ఈ నేపథ్యంలో మోహన్‌చరణ్ మాఝి సర్కారు సమగ్ర కార్యాచరణకు సన్నద్ధమైంది. రాష్ట్రంలోని 10 జిల్లాల్లో మావోయిస్టుల కదలికలున్నాయి. 12 కంపెనీల కేంద్ర బలగాలు, ఒక హెలికాప్టరు కేటాయించాలని మోహన్ కేంద్రాన్ని కోరిన సంగతి తెలిసిందే. మరోవైపు ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి పనులు త్వరగా అమలు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. బరగడ్, బొలంగిర్, కలహండి, బౌద్ధ్, కొంధమాల్, కొరాపుట్, రాయగడ, మల్కాన్‌గిరి, నవరంగపూర్, నువాపడ జిల్లాల్లో మావోయిస్టుల ప్రభావం ఉంది. సంబంధిత జిల్లాల్లోని 583 గ్రామాల్లో 'గ్రామోదయ' పేరిట ప్రభుత్వం సరికొత్త కార్యక్రమం అమలు చేస్తోంది. ప్రభుత్వ శాఖలకు చెందిన 44 పథకాలు ప్రారంభిస్తారు. రాష్ట్రస్థాయిలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) మనోజ్ అహుజా అధ్యక్షతన ఉన్నతస్థాయి సంఘం ఏర్పాటైంది. ఇది 10 జిల్లాల పరిస్థితిని సమీక్షిస్తుంది. ఆయా జిల్లాలు, సమితుల స్థాయిల్లో సంఘాలు ప్రారంభిస్తారు. దీనిపై జన చైతన్య శిబిరాలు నిర్వహిస్తారు. అభివృద్ధి పనులు, పథకాల గురించి సమగ్ర అవగాహన కల్పిస్తారు. ప్రభుత్వ అధికార వర్గాలు గ్రామోదయకు సంబంధించిన వివరాలను మంగళవారం రాత్రి ప్రకటించాయి.

నిస్వార్థ సేవ బిజద లక్ష్యం

★ కోటి సభ్యత్వాల నమోదు ధ్యేయం కావాలి ★ బిజద అధినేత నవీన్ పట్నాయక్


మాట్లాడుతున్న నవీన్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: బిజద రాజకీయాలకే పరిమితంగా లేదని, సేవలకూ ప్రాధాన్యమిస్తోందని, కార్యకర్తలు ప్రజలతో మమేకం కావాలని ఆ పార్టీ అధినేత నవీన్‌పట్నాయక్ పిలుపునిచ్చారు. బుధవారం భువనేశ్వర్ శంఖభవన్ (బిజద కార్యాలయం) వేదికగా.. ఆయన పార్టీ సభ్యత్వం స్వీకరించి నమోదు కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలల వ్యవధిలో కోటి సభ్యత్వాల నమోదు లక్ష్యం చేరుకోవాలన్నారు. ఫిజికల్, డిజిటల్ మాధ్యమాల్లో ఈ కార్యక్రమం చేపట్టాలన్నారు. ఈ దిశగా నేతలు, కార్యకర్తలు చిత్తశుద్ధి కనబరచాలన్నారు. ఇతర పార్టీలు స్వార్థప్రయోజనాలు, అధికారమే పరమావధిగా పని చేస్తున్నాయని, హామీలిచ్చి విస్మరించాయని పరోక్షంగా భాజపాను విమర్శించారు. బిజద తరఫున జనం కోసం పనులు చేద్దామని, అధికారంలో లేకపోయినా సేవలు కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నవీన్ అన్ని జిల్లాల పార్టీ శ్రేణులతో వర్చువల్ మాధ్యమంలో మాట్లాడారు. నవీన్ నివాస్ తలుపులు తెరిచే ఉన్నాయని, ఎవరు ఎప్పుడొచ్చయినా తనతో మాట్లాడొచ్చన్నారు. త్వరలో తాను జిల్లాల్లో పర్యటిస్తానన్నారు. కార్యక్రమంలో బిజద అగ్రనేతలంతా పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న బిజద నాయకులు


ఉత్కళమణి గోపబంధు బహుముఖ ప్రజ్ఞాశాలి: సీఎం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఉత్కళమణి గోపబంధు దాస్ స్వతంత్ర ఒడిశా ఏర్పాటు ఉద్యమానికి ఊపిరిలూదిన మహనీయుడని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్‌మాఝి ప్రస్తుతించారు. గోపబంధు జయంతిని పురస్కరించుకుని బుధవారం భువనేశ్వర్‌లోని శాసనసభ ప్రాంగణంలో గల ఆయన విగ్రహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'సమాజ్' పత్రిక వ్యవస్థాపకుడు గోపబంధు జనం కోసం కలం పట్టారన్నారు. కుష్ఠు వ్యాధిగ్రస్తుల కోసం సేవాశ్రమం ఏర్పాటు చేసి వారికి ఎనలేని సేవలందించారన్నారు. స్వతంత్ర ఒడిశా నిర్మాణంలో కీలకపాత్ర పోషించిన ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి అని, ఉత్కళీయులకు మార్గదర్శి అని అభివర్ణించారు. కార్యక్రమంలో సభాపతి సురమాపాఢి, అసెంబ్లీ కార్యదర్శి దాశరథి మిశ్ర, భువనేశ్వర్ ఏకామ్ర శాసనసభ్యుడు బాబుసింగ్ తదితర ప్రముఖులు పాల్గొని గోపబంధుకి శ్రద్ధాంజలి ఘటించారు.


గోపబంధు విగ్రహం వద్ద మోహన్, ఇతర ప్రముఖులు

బరిపదలో నల్లపులుల సఫారీ

సుశాంత్‌నందో



భువనేశ్వర్, న్యూస్‌టుడే: మయూర్‌భంజ్ జిల్లా కేంద్రం బరిపదలో త్వరలో నల్లపులుల సఫారీ ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (పీసీసీఎఫ్) సుశాంత్‌నందో చెప్పారు. బుధవారం భువనేశ్వర్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సెంట్రల్ అథారిటీ బరిపదలో సఫారీ ఏర్పాటుకు పచ్చజెండా ఊపిందని, సుప్రీంకోర్టు అనుమతి కోసం వేచి చూస్తున్నామన్నారు. భువనేశ్వర్‌లోని నందన్‌కానన్ నుంచి నాలుగు నల్లపులులు, వేరే ప్రాంతం నుంచి ఇంకొకటి తెచ్చి ఇక్కడ సఫారీ ప్రారంభిస్తామన్నారు. పులుల సంతతి పెంచడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

త్వరలో ప్రత్యేక న్యాయస్థానాలు:.. వన్యప్రాణులను వేటపై నమోదవుతున్న కేసులను త్వరగా పరిష్కరించడానికి 30 జిల్లాల్లో ప్రత్యేక న్యాయస్థానాలు ఏర్పాటు కానున్నాయని, ఈ దిశగా సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. అడవుల్లో నేరాలకు పాల్పడుతున్న వారిపై సత్వర చర్యలు కరవవుతున్నాయని, ఈ దిశగా ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. కొద్ది రోజుల్లో జిల్లా కేంద్రాల్లో న్యాయస్థానాలు ప్రారంభం కానున్నాయని నందో తెలిపారు.

మహిళాభ్యుదయం మా ప్రభుత్వ ధ్యేయం

ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి


ప్రజలకు సమస్కరిస్తున్న ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీలు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: మహిళాభ్యుదయం తమ ప్రభుత్వ ధ్యేయమని, స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) ప్రగతికి తాము కట్టుబడి ఉన్నామని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి చెప్పారు. బుధవారం మయూర్‌భంజ్ జిల్లా కేంద్రం బరిపద ఛౌవు మైదానంలో సుభద్ర రెండో విడత సొమ్ము పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ముఖ్యమంత్రి 35 లక్షల మంది మహిళల బ్యాంకు ఖాతాలకు రూ.5 వేలు చొప్పున నగదు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో భాజపా రాష్ట్ర ప్రజలకిచ్చిన హామీలు నెరవేరుస్తోందన్నారు. గత ప్రభుత్వం కేవలం ప్రచారం చేసుకుందని, తమ ప్రభుత్వం పనులు చేస్తోందన్నారు. నవీన్ పాలనలో అభివృద్ధి శూన్యమని, పారిశ్రామిక, వ్యవసాయ రంగాలు నిర్వీర్యమయ్యాయన్నారు. ప్రస్తుతం డబుల్ ఇంజిన్ పాలనలో రాష్ట్రానికన్నీ శుభాలు జరుగుతాయన్నారు. ఇంతవరకు రాష్ట్రంలో అమలైన కార్యక్రమాలన్నింటిలో 'సుభద్ర' బృహత్తరమైందన్నారు. తొలివాయిదా మొదటి విడతగా గత నెల భువనేశ్వర్‌లో ప్రధాని నరేంద్రమోదీ స్వయంగా 25 లక్షల మంది ఖాతాల్లోకి నగదు బదిలీ చేశారన్నారు. రెండో విడతలో 35 లక్షల మందికి చెల్లింపులు జరిగాయని, ఈ సంఖ్య 60 లక్షలకు పెరిగిందని, రూ.3 వేల కోట్లు అందజేసినట్లు తెలిపారు. ఉపముఖ్యమంత్రి ప్రభాతి పరిడ మాట్లాడుతూ ఇంతవరకు 1.60 లక్షల సుభద్ర దరఖాస్తులు పంపిణీ కాగా 1.5 లక్షల మంది రిజిస్ట్రేషన్ పూర్తయిందన్నారు. మిగతా లబ్ధిదారులకు మూడోవిడతలో సొమ్ము త్వరలో జమవుతుందన్నారు. మార్చి 8న రెండో వాయిదా నగదు పంపిణీ అందరికీ ఒకేసారి పంపించేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. కార్యక్రమంలో మంత్రులు కృష్ణచంద్ర మహాపాత్ర్ (పట్టణాభివృద్ధి), గణేష్‌రాంసింగ్ ఖంటియా (అటవీ, పర్యావరణం), ప్రతాప్ షడంగి (బాలేశ్వర్), రాజ్యసభ సభ్యురాలు మమతా మహంతి, శాసనసభ్యులు, అధికారులు పాల్గొన్నారు. మయూర్‌భంజ్ బాలేశ్వర్ జిల్లాకు చెందిన మహిళలు సమావేశానికి తరలివచ్చారు.

కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు



కటక్‌లో 166, భువనేశ్వర్‌లో 187 పెండాళ్లు

★ జంట నగరాలు కళకళ ★ గట్టి బందోబస్తు



భువనేశ్వర్ సత్యనగర్‌లో ఆకర్షణీయమైన పెండాల్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్, కటక్ జంట నగరాల్లో దేవీ నవరాత్రుల సంబరాలు అంబరాన్ని తాకుతున్నాయి. అన్నిచోట్లా ఉత్సవ వాతావరణం కనిపిస్తోంది. ఈసారి దసరా వేడుకల్లో భువనేశ్వర్‌లో 187, కటక్‌లో 166 పెండాళ్లు ఏర్పాటయ్యాయి. కటక్‌లోని త్రివేణియా బగిచా, చౌదరి బజార్, రాణిహాట్, బాదంబాడి తదితర ప్రాంతాల్లో వెండితో విగ్రహాలను అలంకరించారు. ఇవి సందర్శకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. రాత్రి సమయంలో జంట నగరాల కూడళ్లు సందర్శకులతో కిటకిటలాడుతున్నాయి. పెండాళ్లలో దేవీస్తోత్ర పారాయణాలు, హోమాలు కొనసాగుతున్నాయి.

కట్టుదిట్టమైన భద్రత



జంట నగరాల్లో దేవీ నవరాత్రుల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్టు కమిషనర్ సురేష్‌దేవదత్తసింగ్ బుధవారం విలేకర్లకు చెప్పారు. కటక్‌లో 68, భువనేశ్వర్‌లో 38 ప్లటూన్ల బలగాలతో పాటు 200 మంది అధికారులను నియమించామన్నారు. దేవీ పెండాళ్ల వద్ద కేంద్ర బలగాలూ ఉంటాయన్నారు. అన్ని కూడళ్లలో పోలీసు కంట్రోల్ కేంద్రాలు ప్రారంభించామని, మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసులు కవాతు నిర్వహిస్తున్నారన్నారు.


కటక్ రాణిహాట్ దుర్గమ్మ


కటక్ చౌదరి బజార్‌లో అమ్మవారు

సరస్వతీ నమస్తుభ్యం


మార్తాపేటలోని దేవస్థానంలో రామలింగ చౌడేశ్వరి అమ్మవారు


జటాధరేశ్వరస్వామి ఫంక్షన్ హాల్లో సామూహిక పూజలు


బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం బ్రహ్మపురలోని వివిధ మందిరాల్లో అమ్మవార్లను 'మహా సరస్వతీ దేవి' అవతారంతో అలంకరించి పూజించారు. మార్తాపేటలోని రామలింగ చౌడేశ్వరి, ఇదే ఆవరణలోని రేవణ సిద్ధేశ్వరస్వామి, హౌసింగు బోర్డులోని గాయత్రీమాత మందిరాల్లో అమ్మవార్లను సరస్వతి అవతారంతో అలంకరించారు. ఖస్పావీధిలోని జటాధరేశ్వరస్వామి ఫంక్షన్ హాల్లో నిర్వహించిన సామూహిక పూజల్లో పలువురు బాలలు, మహిళలు పాల్గొని సరస్వతీ దేవికి పూజలు చేశారు. ఆర్యవైశ్య మహిళా విభాగం ఆధ్వర్యంలో ప్రేమనగర్ రెండో లైనులోని చవ్వా సుబ్బారావు ఫంక్షన్ హాల్లో మహిళల సామూహిక కుంకుమార్చనలు ఘనంగా నిర్వహిస్తున్నారు. పలు లక్కీ డిప్‌లు, ఇతర పోటీల్లో విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

గాయత్రిదేవిగా కటక్ చండీ

భువనేశ్వర్, న్యూస్‌టుడే: దుర్గమ్మను కొలిస్తే శుభాలు చేకూరుతాయన్నది భక్తుల నమ్మకం. శక్తిపీఠాలకు నెలవైన రాష్ట్రంలో శరన్నవరాత్రులను పురస్కరించుకొని తల్లుల సన్నిధిలో షోడశోపచార సేవలు నిర్వహిస్తున్నారు. బుధవారం షష్టి తిథిని పురస్కరించుకుని కటక్ చండీ మాతను గాయత్రీదేవి రూపంలో అలంకరించారు. పూరీలోని కాకట్‌పూర్ మామంగళా అమ్మవారు పరాశక్తి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చింది.


గాయత్రిగా చండీమాత

కలపపై శక్తిపీఠాల నమూనాలు


కలపతో గంజాం జిల్లాలోని ప్రముఖ శక్తిపీఠాల నమూనాలు


తీర్చిదిద్దిన కళాకృతితో దిలీప్ మహరణా

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా బ్రహ్మపురకు చెందిన యువ కళాకారుడు దిలీప్ మహరణా కలపపై గంజాం జిల్లాలోని ప్రముఖ శక్తిపీఠాల నమూనాలు తీర్చిదిద్దాడు. 15 ఇంచీల పొడవు, 12 ఇంచీల వెడల్పున రూపొందించిన ఈ కళాకృతిలో జిల్లాలోని ప్రముఖ 18 శక్తిపీఠాల ఆకృతుల్ని పొందుపరిచినట్లు మహరణా బుధవారం 'న్యూస్‌టుడే'కు చెప్పాడు. ఆయా నమూనాల్లో 0.5 ఇంచీల అమ్మవార్ల ఆకృతుల్ని తీర్చిదిద్దానని, ఇందుకోసం పది రోజులకుపైగా సమయం పట్టిందని తెలిపాడు. శక్తిపీఠాల్లో తరాతరిణి, మా కంధుని దేవి, మా నారాయణి, బ్రహ్మపుర పెద్దమ్మవారు, మా శ్యామలాయి, మొహురి కాళువ, మా ఖంబేశ్వరి, మా సింహాసిని, మా రామచండీ, బాలకుమారి, భైరవి తదితర శక్తిపీఠాల ఆకృతులున్నాయని వివరించాడు.

ఎట్టకేలకు వంతెన మరమ్మతులు ప్రారంభం


పనులు చేస్తున్న కార్మికులు

రాయగడ గ్రామీణం,న్యూస్‌టుడే; ఏళ్లుగా పాడైన వంతెన బాగుచేసేందుకు అడుగులు పడ్డాయి. ఈ వారధి రాయగడ ప్రధాన రహదారిలో పరతపుర్ గ్రామం వద్ద జంఝావతి నదిపై ఉంది. 50 ఏళ్ల క్రితం నిర్మించడంతో దీనిపై ఉన్న రోడ్డు పూర్తిగా పాడై గోతులు ఏర్పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షాలకు మరింత అధ్వానంగా తయారవడంతో వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. తక్షణమే మరమ్మతులు చేయాలని ఫిర్యాదులు, వినతులు అందడంతో ప్రజాపనుల శాఖ బాగు చేశారు. ఈ వంతెన మీదుగా వందలాది భారీ వాహనాలు ఛత్తీస్‌గఢ్, బిహార్‌లకు రాకపోకలు సాగిస్తుంటాయి. జిల్లాలోని ప్రధాన పరిశ్రమలకు చెందిన వాహనాలు రాకపోకలు సాగించేది ఈ మార్గంలోనే. ఎట్టకేలకు మర్మమతులు చేపడుతుండడంతో రాకపోకలు సాగించే వారు ఊపిరి పీల్చుకుంటున్నారు. ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనన్న భయాందోళనకు గురయ్యామని, ఇప్పుడు ఆ భయం తీరుతోందని చోదకులు అంటున్నారు. నెలరోజుల్లో పనులు పూర్తి చేస్తామని, అంతవరకు ఒక వైపు రోడ్డులో వాహనాల రాకపోకలకు అనుమతి ఇచ్చినట్లు ప్రజాపనుల అధికారి హండుబెహరా తెలిపారు.

కొన్నారు... విస్మరించారు

రూ.40 కోట్ల విలువైన బస్సులు నిరుపయోగం


నిరుపయోగంగా బస్సులు

గోపాలపూర్, న్యూస్‌టుడే: పూరీకి వస్తున్న భక్తుల సౌకర్యార్థం గత ప్రభుత్వం 10 నెలల క్రితం రూ.40 కోట్లు వెచ్చించి 35 ఏసీ ఈ-బస్సులు కొనుగోలు చేసింది. శ్రీ జగన్నాథ పరిక్రమణ మార్గం ప్రారంభం సమయంలో అప్పటి ముఖ్యమంత్రి నవీన్‌పట్నాయక్ వీటికి పచ్చజెండా ఊపారు. తర్వాత ఇవి నిరుపయోగంగా మారాయి. వీటి విషయం శ్రీక్షేత్ర యంత్రాంగం పూర్తిగా విస్మరించింది. ప్రజాధనంతో కొనుగోలు చేసినవి నిరుపయోగమవుతున్నాయని పూరీ వాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఛార్జింగ్ కేంద్రాలు లేవు

రూ.కోట్లు పెట్టి ఈ-బస్సులు కొనుగోలు చేసి శ్రీక్షేత్ర యంత్రాంగానికి అప్పగించిన గత ప్రభుత్వం ఛార్జింగ్ కేంద్రం ఏర్పాటు చేయకపోవడం విడ్డూరం. ఏ ఉద్దేశంతో బస్సులు కొనుగోలు చేశారన్నదానిపై అధికారుల వద్ద సమాధానం లేదు. విలేకర్లు అడిగితే ముఖాలు చాటేస్తున్నారు. శ్రీక్షేత్రం నాలుగు ద్వారాలు, రత్నభాండాగారం తెరిపించామని పునరుద్ఘాటిస్తున్న ప్రస్తుత భాజపా పాలకులు బ్యాటరీ బస్సులు వినియోగంలోకి తేకపోవడం ఆశ్చర్యంగా ఉంది. మరికొన్నాళ్లు ఇలాగే వదిలేస్తే అవి పాడైపోయి పనికి రాకుండా పోతాయన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. కార్తిక వ్రతాలు చేయడానికి రానున్న హబిషార్థుల కోసం యంత్రాంగం అద్దె బస్సులు సిద్ధం చేస్తోంది. కొనుగోలు చేసిన వాహనాలు వినియోగంలోకి తెచ్చి ఉంటే సొమ్ము ఆదా అయ్యేది. ఈ దిశగా సత్వర చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

యువతి బలవన్మరణం: తండ్రి, సవతి తల్లి అరెస్టు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపుర సదర్ ఠాణా పరిధిలోని కుకుడాఖండిలో తండ్రి, సవతి తల్లి వేధింపులు భరించలేక రాణి ప్రధాన్ (20) అనే యువతి శరీరంపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుని బలవన్మరణానికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఆమె మరణ వాంగ్మూలం నమోదు చేసుకుని ఆమె తండ్రి అశోక్ కుమార్ ప్రధాన్ (46), సవతి తల్లి జ్యోత్స్నారాణి ప్రధాన్ (31)లను బుధవారం అరెస్టు చేసినట్లు బ్రహ్మపుర ఎస్పీ శరవణ వివేక్ ఎం. సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. యువతి ఆత్మహత్యకు ఉపయోగించిన పెట్రోలు పోసి ఉంచిన సీసా తదితరాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. రాణి బ్రహ్మపురలోని ఓ కళాశాలలో డిగ్రీ ఆఖరి సంవత్సరం చదువుతోంది. ఆమెకు ఏడాదిన్నర వయసున్నపుడు తల్లి మృతిచెందింది. అనంతరం తండ్రి అశోక్ 18 ఏళ్ల కిందట జ్యోత్స్నారాణిని రెండో పెళ్లి చేసుకున్నాడు. తల్లిదండ్రులతో కుకుడాఖండి సమితి కార్యాలయం ఎదురుగా అద్దె ఇంట్లో ఉంటున్న రాణిని వీరిద్దరూ తరచూ శారీరకంగా, మానసిక వేధించేవారు. ఇంటి నుంచి బయటకు వెళ్లిపోవాలని, ఆత్మహత్య చేసుకోవాలని ఆమెపై ఒత్తిడి తెచ్చేవారని ఆమె తన మరణ వాంగ్మూలంలో పేర్కొందని ఎస్పీ వెల్లడించారు.

శ్రీక్షేత్రంలో దివ్యాంగులకు ర్యాంప్

గోపాలపూర్, న్యూస్‌టుడే: పూరీ శ్రీక్షేత్రంలో దివ్యాంగుల కోసం ర్యాంప్ నిర్మిస్తారు. మహిళలు, వృద్ధులు, పిల్లలకు సులభ దర్శన విధానం అమలు కానుంది. జగన్నాథ సన్నిధిలో ఈ నెల 14 నుంచి కార్తిక సేవలు ప్రారంభం కానున్నాయి. పురుషోత్తముడు రాధాదామోదర రూపంలో భక్తులకు దర్శనమిస్తాడు. 35 రోజులపాటు ప్రత్యేక సేవలు కొనసాగుతాయి. ఇవి నిర్ణీత వేళల్లో చేపట్టాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి నీలాద్రి భక్త నివాస్‌లో పాలనాధికారి అరవిందపాఢి అధ్యక్షతన ఛత్తీసా నియోగ్‌ల (36 తెగల సేవాయత్ ప్రతినిధులు) సమావేశం జరిగింది. కార్యక్రమంలో పూరీ జిల్లా పాలనాధికారి సిద్ధార్థ్ శంకర్ స్వయిన్, ఇతర అధికారులు పాల్గొన్నారు. కార్తిక సేవలు నిర్ణీత వేళల్లో చేపట్టాలని, విధి నిర్వహణలో అలక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పాలనాధికారి సేవాయత్‌లను హెచ్చరించారు. సమావేశానంతరం అరవిందపాఢి విలేకర్లతో మాట్లాడారు. ఒబడా ప్రాజెక్టు కింద ఒడిశా బ్రిడ్జ్ అండ్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్(ఓబీసీసీ) ఆలయంలోని 7 మెట్ల మార్గంలో ర్యాంప్ నిర్మాణం పనులు కార్తిక మాసం ముగిసిన తరువాత చేపడుతుందన్నారు. నాట్య గోపురంలో మూడు వరుసల బారికేడింగ్ ఉంటుందని, మహిళలు, వృద్ధులు, పిల్లలు సునాయాసంగా స్వామి దర్శనం చేసుకునే వెసులుబాటు కలుగుతుందన్నారు. కార్తికంలో పెద్ద సంఖ్యలో శ్రీక్షేత్రానికి భక్తులొస్తారు. హబిషార్థులు వ్రతాలు చేస్తారు. కార్తిక శుక్ల దశమి నుంచి పౌర్ణమి వరకు పొంచుకలో భాగంగా పురుషోత్తముడు దివ్య అవతారాల్లో భక్తులకు దర్శనమిస్తాడు. ఈ సమయంలో లక్షలాది మంది వస్తారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఆలయం లోపల, వెలుపల కట్టుదిట్టమైన బందోబస్తు చేపడతామన్నారు. అందరికీ ఒబడా (మహా ప్రసాదం) అందుబాటులోకి తెస్తామన్నారు.


విలేకర్లతో మాట్లాడుతున్న అరవింద. పక్కన పాలనాధికారి సిద్ధార్థ్

రావణాసురుడి దిష్టిబొమ్మ తయారీ



మెరుగు దిద్దుతున్న కళాకారుడు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో విజయదశమి నాడు కొత్తకోలీ రావణ మైదానంలో రావణాసురుడి దిష్టిబొమ్మ దహన కార్యక్రమానికి దుర్గాపూజ పనులు సాగుతున్నాయి. దీన్ని కొత్తకోలీ ఆజాద్ బాయ్స్ క్లబ్ తయారు చేస్తున్నారు. ఈ కమిటీ ప్రధాన కార్యదర్శి డి.రామ్మోహనరావు, అధ్యక్షుడు బి.రాంబాబు, కార్యనిర్వాహక అధ్యక్షుడు బి.గోవిందరావు మాట్లాడుతూ దిష్టిబొమ్మ దహనం కార్యక్రమం వందో సంవత్సరం కావడంతో తయారీలో ప్రత్యేకత ఉంటుందన్నారు. 55 అడుగుల ఎత్తు పది తలల రావణాసురుడితో పాటు 30 అడుగుల ఎత్తు కుంభకర్ణ, మేఘనాథుని దిష్టిబొమ్మలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు వేలాది సంఖ్యలో ప్రజలు తరలివస్తారని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఉంటుందన్నారు.

చదువుల తల్లికి వందనం

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు జ్ఞాన సరస్వతి రూపంలో దర్శనమిచ్చారు. పట్టణాల్లో పలు మండపాల వద్ద అక్షరాభ్యాసం చేయించి విద్యార్థులకు పలక, బలపం, పుస్తకాలు పంచిపెట్టారు. శాంతి హోమాలు చేశారు. -న్యూస్‌టుడే, బృందం



పర్లాఖెముండి: గుసాని సమితి ఉప్పలాడలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహం



ఖరగ్‌పూర్: బాబు లైన్‌లో ఆకర్షణీయంగా మండపం



రాయగడలో సరస్వతీ రూపంలో ..

బిజద సభ్యత్వ నమోదు



రాయగడ కార్యక్రమంలో భాస్కరరావు, సరక, హిమిరిక, మహేష్, కార్యకర్తలు

రాయగడ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో మళ్లీ బిజద ప్రభుత్వం ఏర్పడుతుందని, ముఖ్యమంత్రిగా నవీన్‌పట్నాయక్ పాలనా పగ్గాలు చేపడతారని రాజ్యసభ మాజీ సభ్యుడు, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు అన్నారు. బుధవారం ఎస్పీజీ మైదానం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదులో పాల్గొన్నారు. రాష్ట్రస్థాయిలో భువనేశ్వర్‌లో జరిగిన కార్యక్రమంలో నవీన్‌పట్నాయక్ హాజరుకావడంతో ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేశారు. కార్యకర్తలు రెట్టించిన ఉత్సాహంతో పని చేయాలన్నారు. మాజీ మంత్రులు లాల్ బిహారి హిమిరిక, జగన్నాథ సరక, పురాధ్యక్షుడు మహేష్‌పట్నాయక్ ఉన్నారు.

ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి



ప్రధాన రహదారిపై పరిస్థితి సమీక్షిస్తున్న అధికారులు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా సిమిలిగుడ పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రెవెన్యూ, పోలీసులు, పురపాలక సంస్థ అధికారులు ప్రత్యేక దృష్టి నిలుపుతున్నారు. గత కొద్ది రోజులుగా ఈ సమస్య మరింత తీవ్రరూపం దాల్చింది. షాపింగ్‌మాల్స్, హోటళ్లు, చిన్న చిన్న దుకాణాల వద్ద వాహనాలు నిలిపివేయడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇటీవల ఒక షాపింగ్‌మాల్ ప్రారంభంతో రద్దీ ఏర్పడింది. జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. గత నాలుగు రోజుల ఇదే స్థితి. ఈ సమస్యను పరిష్కరించాలని అన్ని వర్గాలు డిమాండు చేశాయి. ఈ షాపింగ్‌మాల్‌తో పాటు పలు దుకాణాలను నిబంధనలు పాటించకుండా ఏర్పాటు చేసిన యజమానులకు అధికారులు శ్రీముఖాలు జారీ చేశారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తామని, దీనికి కారకులైన వారిపై చర్యలు తీసుకుంటామని యంత్రాంగం తెలిపింది. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి సిమిలిగుడ అదనపు తహసీల్దార్ దేవీప్రసాద్ నాయక్, సునాబెడ రాణా అధికారి సత్యనందపాత్రో, పురపాలక సంస్థ కార్యనిర్వాహక అధికారి నారాయణ నాయక్‌తో పాటు ఆయా విభాగాల అధికారులు తనిఖీలు చేశారు.

ముగిసిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు



జ్ఞాపికతో అండర్-17 కేంద్రపడ విజేత బాలిక జట్టు, పాలనాధికారి దాస్‌తో అతిథులు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: విద్యాశాఖ ఆధ్వర్యంలో పర్లాఖెముండి పట్టణం గజపతి క్రీడా మైదానంలో మూడు రోజులుగా జరుగుతున్న 68వ రాష్ట్రస్థాయి వాలీబాల్‌పోటీలు బుధవారంతో ముగిశాయి. ఒడిశాలో 30 జిల్లాల నుంచి అండర-14, 17 విభాగాల్లో విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలుగా అండర్-17 కేంద్రపడ బాలిక, బాలురతో పాటు అండర్-14 ఢెంకనాల్ బాలికలు, అనుగుల్ బాలురు నిలిచారు. వీరితో పాటు రన్నరప్ జట్లకు ప్రశంసాపత్రాలు జ్ఞాపికలు అందజేశారు. పాలనాధికారి బిజయ్‌కుమార్‌దాస్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి అతిథులుగా అదనపు పాలనాధికారి రాజేంద్రమింజ్, సబ్‌కలెక్టర్ అనూప్‌పండ, బీడీఓ గౌరచంద్ర పట్నాయక్ జిల్లా విద్యాధికారి మాయదర్ సాహు, జిల్లా క్రీడాధికారి ప్రాణోకృష్ణాపాణిగ్రహి తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డు నవీకరణకు గిరిజనుల పాట్లు



కేంద్రం వద్ద వేచి ఉన్న గిరిజనులు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: ఒడిశా-ఆంధ్రా వివాదాస్పద కొఠియా గ్రామాల గిరిజనులు తమ రేషన్ కార్డు నవీకరణకు పడరాని పాట్లు పడుతున్నారు. రాష్ట్రంలో నకిలీ రేషన్‌కార్డులు వెతికితీసే ఉద్దేశంతో రాష్ట్రప్రభుత్వం లబ్ధిదారులందరికి కేవైసీ అప్‌డేట్ చేయాలని సూచించింది. దీంతో వారంతా రేషన్ డిపోలకు వెళ్లి కార్డులు అప్‌డేట్ చేస్తున్నారు. గ్రామాల్లో సంకేతాల సమస్య ఎదురవ్వడంతో కేవలం గంజాయి పాదొరో రేషన్ డిపోలో మాత్రమే అప్‌డేట్ జరుగుతుంది. దీని కోసం గిరిజనులు కి.మీ దూరం నడుచుకుంటూ కేంద్రానికి వెళ్తుండంతో రద్దీ నెలకొంది. గత 15 రోజులుగా ఇదే దుస్థితి. సంకేతాలు సమస్య పరిష్కరించడంలో రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు చొరవ చూపడం లేదని గిరిజనులు ఆరోపించారు.

అన్ని రంగాల్లో ఆడపిల్లలదే పైచేయి



మాట్లాడుతున్న కలెక్టర్ పరుల్ పట్వారి, పక్కన సరస్వతి

రాయగడ, న్యూస్‌టుడే: గతంలో కన్నా ప్రస్తుతం ఆడపిల్లలు చదువు, క్రీడలతో పాటు అన్నిరంగాల్లోనూ రాణిస్తున్నారని, కుటుంబంలో ఇంకా కొంతమంది వివక్షత చూపడం సరికాదని జిల్లా పాలనాధికారి పరుల్ పట్వారి అన్నారు. బుధవారం జిల్లా పరిషత్ సమావేశ భవనంలో జరిగిన అంతర్జాతీయ బాలికల దినోత్సవ సభలో పాల్గొని ప్రసంగించారు. డిప్యూటీ కలెక్టర్ బిచిత్ర శెఠి మాట్లాడుతూ ఈనెల 14న జరగాల్సిన కార్యక్రమం ముందుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, అధ్యాపకురాలు మానసి మహంతి ఉన్నారు. ప్రతిభావంతులైన బాలికలను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

రాజ్‌భవన్ ముట్టడికి ఛాత్ర కాంగ్రెస్ యత్నం

భువనేశ్వర్,న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని ఉత్కళ విశ్వవిద్యాలయం (వాణివిహార్)లో విద్యార్థుల ప్రవేశాలు సక్రమంగా జరగడం లేదన్న అభియోగంతో ఛాత్ర కాంగ్రెస్ నేతలు బుధవారం సాయంత్రం రాజ్‌భవన్ ముట్టడికి యత్నించారు. పోలీసులు చేరుకుని పరిస్థితిని నియంత్రించారు. ఛాత్ర కాంగ్రెస్ నేత యాసిర్ నవాజ్ విలేకర్లతో మాట్లాడుతూ వాణి విహార్ యంత్రాంగం నియంతృత్వ వైఖరి ప్రదర్శిస్తోందని, దీనిపై కులపతి హోదాలో గవర్నరు చర్యలు తీసుకోనందున ఆందోళన చేపట్టామన్నారు.



ప్రముఖ స్వాతంత్ర్యసమరయోధుడు, సంఘ సంస్కర్త ఉత్కళమణి పండిత గోపబంధు దాస్ 147వ జయంత్యుత్సవాలు బుధవారం బ్రహ్మపురలో నిరాడంబరంగా నిర్వహించారు. మానవ అధికార్ సురక్షా మంచ్ సాంస్కృతిక విభాగం పూజ్య పూజా సమితి ఆధ్వర్యంలో ప్రతినిధులు ఉదయం గిరి రోడ్డు కూడలిలోని దాస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. –న్యూస్‌టుడే, బ్రహ్మపుర నగరం

రద్దీ నియంత్రణకు చర్యలు



కొత్తబస్టాండు ప్రాంతంలో బుధవారం ట్రాఫిక్ పద్మవ్యూహంలో చిక్కుకున్న ప్రజలు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: దసరా నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో బ్రహ్మపురలోని వివిధ రహదారుల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. బుధవారం సాయంత్రం కొత్తబస్టాండు రోడ్డులో వాహన చోదకులు ట్రాఫిక్ పద్మవ్యూహంలో చిక్కుకున్నారు. ఆయా సమస్యలను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక చర్యలు తీసుకున్నామని బ్రహ్మపుర ఎస్పీ శరవణ వివేక్ ఎం. బుధవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఆరు చోట్ల ఖొడాసింగి, లుచ్చాపడ రోడ్డు, పాత బ్రహ్మపుర, అస్కా రోడ్డు మొదటి గేటు, విజయ సినిమా కూడలి, బెజ్జిపురం కూడలిలో తాత్కాలిక పోలీసు ఔట్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నేర చరిత్ర గల వారి కదలికలపై నిఘా పెట్టేందుకు నగరంలోకి ప్రవేశించే అన్ని మార్గాల్లో నాకాబందీ జరుపుతున్నామని తెలిపారు. రద్దీగా ఉండే ప్రాంతాల్లో చోరీలు, మహిళల మెడ నుంచి గొలుసులు లాక్కుపోయే వారిపై సాధారణ దుస్తుల్లో పోలీసులు నిఘా పెడతారని చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

వాహనాల దారి మళ్లింపు

బ్రహ్మపురలో రద్దీ నియంత్రించేందుకు వాహనాల రాకపోకలపై బుధవారం నుంచి ఈ నెల 13వ తేదీ వరకూ పలు ఆంక్షలు విధించామని ఎస్పీ శరవణ వివేక్ ఎం. తెలిపారు. సాయంత్రం 4 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకూ అవి అమల్లో ఉంటాయని అన్నారు. ● భువనేశ్వర్‌వైపు బ్రహ్మపురానికి నుంచి వచ్చే భారీ వాహనాలు, బస్సులు లంజిపల్లి బైపాస్ నుంచి కొమ్మాపల్లి కూడలికి రాకుండా నిషేధం. ● హల్దియాపదర్ కూడలి నుంచి అంధపసర రోడ్డు మీదుగా నగరంలోకి భారీ వాహనాలు, బస్సులు రాకూడదు. ● అటు వైపు నుంచి బ్రహ్మపురలోకి వచ్చే వాహనాలు గోపాలపూర్ కూడలి, ఖొడాసింగి, కోర్టుపేట కూడలి మీదుగా కొత్తబస్టాండు రోడ్డుకు వెళ్లాలి. ● కొత్తబస్టాండు నుంచి జాతీయ రహదారివైపునకు వెళ్లే భారీ వాహనాలు, బస్సులు గేటుబజారు, ఎస్‌బీఐ కూడలి, సుబ్బారావు కూడలి, టాటాబెంజ్, కొమ్మాపల్లి, కోర్టుపేట, ఇంజినీరింగు స్కూలు కూడలి మీదుగా గోపాలపూర్ కూడలివైపు వెళ్లాలి. ● అస్కా, దిగపొహండిల వైపుల నుంచి వచ్చే భారీ వాహనాలు, బస్సులు హరడాఖండి పెట్రోలు బంకు కూడలి మీదుగా అంధపసర రోడ్డువైపు వెళ్లకూడదు. ఆయా వాహనాలు గేటుబజజారు, ఎస్‌బీఐ, సుబ్బారావు కూడలి, టాటాబెంజ్, కొమ్మాపల్లి, కోర్టుపేట, కూడలి మీదుగా కొత్తబస్టాండుకు వెళ్లాలి. ● బ్రహ్మపురలోని కళ్లికోట వర్సిటీ కూడలి నుంచి సుబ్బారావు కూడలి, బాలుంకేశ్వర మందిరం కూడలి నుంచి పెద్దబజారు, తాలూకా కూడలి నుంచి దేశిబెహర వీధి కూడలి, గిరి మార్కెట్ నుంచి హనుమాన్ బజారు వరకూ సాయంత్రం 4 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకూ నాలుగు చక్రాల వాహనాలు, ఆటో రిక్షాల రాకపోకలపై నిషేధం విధించారు.

ఎమ్కేసీజీలో ఆరోగ్య సేవలు చక్కదిద్దాలి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: దక్షిణ ఒడిశాలోని పలు జిల్లాల వాసులు ఆరోగ్య సేవల కోసం ఆధారపడుతున్న ఎమ్కేసీజీ వైద్య కళాశాల ఆసుపత్రిలో వైద్య సేవలు మరింత చక్కదిద్దాలని బ్రహ్మపుర ప్రెస్ క్లబ్ కోరింది. క్లబ్ ప్రతినిధులు బుధవారం ఎమ్కేసీజీ డీన్, ప్రధానాచార్యురాలు ప్రొఫెసర్ సుచిత్ర దాస్‌ను కలిసి వివిధ సమస్యలపై చర్చించారు. ఎమ్కేసీజీ రిజిస్ట్రార్ సంగ్రాం పండా కూడా ఉన్నారు. ఎమ్కేసీజీలోని అత్యవసర విభాగంలో నిపుణులైన వైద్యుల్ని నియమించాలని, బాధితులకు తక్షణ వైద్యం అందించాలని కోరారు. అత్యవసర విభాగంలో ఐసీయూ, వెంటిలేటర్ వంటి సౌకర్యాలు సమకూర్చాలని పేర్కొన్నారు. ఆసుపత్రిలో వైద్యులు, నర్సులు, సిబ్బంది, పోలీసులు, జవానులకు ప్రత్యేక టికెట్ కౌంటర్లు ఉన్నాయని, మీడియా ప్రతినిధులకూ కూడా ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. వార్తా సేకరణలో ఇబ్బందులు కలగకుండా వైద్య సిబ్బంది సహకరించాలని అన్నారు. పలు డిమాండ్లతో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి పేరిట ఓ వినతిపత్రాన్ని డీన్, ప్రధానాచార్యురాలు ప్రొఫెసర్ దాస్‌కు అందజేశారు. బ్రహ్మపుర ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అశోక్ బ్రహ్మ, కార్యదర్శి ప్రహ్లాద సాహు, కోశాధికారి శిబనారాయణ పండా తదితరులు పాల్గొన్నారు.



ఎమ్కేసీజీ డీన్, ప్రధానాచార్యురాలు ప్రొఫెసర్ సుచిత్ర దాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రెస్ క్లబ్ ప్రతినిధులు

డిమాండ్లు నెరవేర్చాలంటూ వినతి



న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని ఒడిశా శిక్ష్యా ఆమ్లా సంఘం డిమాండు చేసింది. సంఘం గంజాం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం గిరిరోడ్డులోని జిల్లా విద్యాధికారి (డీఈఓ) కార్యాలయం ఆవరణలో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం రాష్ట్ర స్కూల్ అండ్ మాస్ ఎడ్యుకేషన్ మంత్రి పేరిట ఓ వినతిపత్రాన్ని కార్యాలయం అధికారులకు అందజేశారు. –న్యూస్‌టుడే, బ్రహ్మపుర నగరం



పార్వతీపురంలోని జిల్లా ఆసుపత్రిలో జ్వర బాధితులు

పార్వతీపురం పట్టణం, గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: మన్యంలో జ్వర పీడితులు పెరుగుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 79 ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులున్నాయి. రోజుకు 3 వేలకు పైగా ఓపీ నమోదవుతోంది. సుమారు 1000 మంది వరకు జ్వరం, జలుబు, దగ్గు వంటి రుగ్మతలతో వస్తుండగా చాలా మంది మలేరియా, డెంగీ, ఇతర జ్వరాల బారిన పడుతున్నారు. దీంతో కొందరిలో ప్లేట్‌లెట్లు తగ్గిపోతున్నాయి. డెంగీ బాధితులపై ఈ ప్రభావం మరింత ఎక్కువ. ఇటీవల ప్లేట్‌లెట్లు తగ్గిపోవడంతో ఇద్దరు వసతి గృహ విద్యార్థులు మృతి చెందడం గమనార్హం. గతంలో ఒకటి, రెండు కేసులు వస్తే స్థానికంగానే వైద్యం అందించేవారు. ప్రస్తుతం 20 వేల కంటే తక్కువకు పడిపోతుండటంతో విజయనగరం, విశాఖ తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు.

ప్లేట్‌లెట్స్ పడిపోతున్నాయ్

మన్యంలోని మారుమూల కొండల్లో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. రక్త ప్లేట్‌లెట్స్ తగ్గి రోగులు ఆసుపత్రులకు వరుస కడుతున్నారు. కేవలం నెల రోజుల్లోనే జిల్లా ఆసుపత్రిలో 15 కేసులు నమోదు కావడంతో వైద్యులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీరంతా గిరిజనులే.

జిల్లాలో వరుసగా నమోదవుతున్న కేసులు

గిరిజనులే బాధితులు

కొన్ని ఘటనలు ఇలా..

◆ గుమ్మలక్ష్మీపురం మండలం పి.ఆమిటి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థిని అవంతి ఇటీవల మృతి చెందింది. ఈమెకు గత నెలలో ప్లేట్‌లెట్లు తగ్గడంతో విజయనగరం తరలించారు. కోలుకున్నాక ఇంటికి వచ్చిన కొన్నిరోజులకే మరోసారి జ్వరం బారిన పడింది. జిల్లా ఆసుపత్రిలో రక్తం ఎక్కించినా ఫలితం లేకుండా పోయింది. ◆ గత నెల 14న గుమ్మలక్ష్మీపురం మండలం కూరసింగికి చెందిన గర్భిణి బి.సుభాని జిల్లా ఆసుపత్రిలో చేరారు. ప్లేట్‌లెట్లు 16 వేలకు పడిపోవడంతో హుటాహుటిన విశాఖ తరలించారు.

◆ పార్వతీపురం మండలం కొత్తూరుకు చెందిన గర్భిణి గత నెలలో జ్వరంతో ఆసుపత్రిలో చేరారు. ప్లేట్‌లెట్లు 52 వేలకు పడిపోయినట్లు గుర్తించిన వైద్యులు కేజీహెచ్‌కు తరలించారు.

ఏడో తరగతి చదువుతున్న ఈ విద్యార్థి పేరు సిద్ధు. నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. పచ్చ కామెర్ల బారిన పడ్డాడు. రక్తంలో హెచ్‌బీ 8 గ్రాము లుంది. ప్లేట్‌లెట్లు 41 వేలకు పడిపోయాయి. ప్రాణాపాయ స్థితిలో ఉన్న విద్యార్థిని విశాఖ తరలించారు. →



క్షేత్రస్థాయిలో అధ్వానం

గిరిజన ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిసరాలు అధ్వానంగా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో మలేరియా, డెంగీ దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. నివాసాల మధ్య తుప్పలు ఉండటంతో దోమ వృద్ధి చెందుతోంది. ఖాళీ పాత్రల్లో నీటి నిల్వలు, మూతలు లేకపోవడం, డ్రైడే సక్రమంగా పాటించడం లేదు. పారిశుద్ధ్య పనులు అంతంతగానే ఉండటంతో గిరిజనులు డెంగీ, మలేరియా బారిన పడుతున్నట్లు వైద్యులు భావిస్తున్నారు.

అప్రమత్తంగా ఉన్నాం..: జిల్లా ఆసుపత్రికి ప్లేట్‌లెట్లు తగ్గుతున్న కేసులు వస్తున్నాయి. గిరిజన గర్భిణులు, చిన్నారుల్లో ఈ పరిస్థితి ఉంది. సాధ్యమైన మేర స్థానికంగా వైద్యం అందిస్తున్నాం. 20 వేల కంటే తక్కువకు పడిపోతే విశాఖ, విజయనగరం తరలిస్తున్నాం. శాఖ పరంగా అప్రమత్తంగా ఉన్నామన్నారు. - వాగ్దేవి, సూపరింటెండెంట్

బిజద సభ్యత్వ నమోదు ప్రారంభం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా బిజద ఆధ్వర్యంలో బుధవారం సభ్యత అభియాన్ శుభారంభం జరిగింది. బిజద అధినేత, మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వర్చువల్‌లో దీన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ గంజాం జిల్లా శాఖ ఆధ్వర్యంలో బ్రహ్మపుర శివారున అంబపువాలోని ఎస్3 లాన్‌లో అభియాన్ ప్రారంభం జరిగింది. కార్యక్రమంలో బిజద జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రమేష్‌చంద్ర చ్యవుపట్నాయక్, బ్రహ్మపుర, అస్కా మాజీ ఎంపీలు చంద్రశేఖర సాహు, ప్రమీలా బిశోయి, మాజీ శాసనసభ్యులు బిక్రం కుమార్ పండా, సూర్యమణి బైద్య, మంజులా స్వాయిన్, నందినీదేవి, పూర్ణచంద్ర స్వాయిన్, సుభాష్ బెహరా, బీఈఎంసీ మేయరు సంఘమిత్ర దొళాయి, ఉప మేయరు ఈ.వివేక్ రెడ్డి పాల్గొన్నారు.



బ్రహ్మపురలోని అంబపువాలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న బిజద నాయకులు, మాజీ ఎంపీలు, మాజీ శాసనసభ్యులు తదితరులు



ప్రశంసాపత్రాలతో రక్తదాతలు

రక్తదాన శిబిరం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సిమిలిగుడకు చెందిన కల్పతు ప్రాజెక్టు ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఛైర్మన్ మాపట్‌రాజ్ ముంటి 80వ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తనిధి అధికారులు ఆధ్వర్యంలో 30 మంది దానం చేశారు. ఇందులో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం స్థానిక అటవీ శాఖ సహకారంతో జరిగింది. దాతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. స్థానిక కార్యాలయం ప్రాజెక్టు మేనేజర్ పి.ఎస్.శశికుమార్, అధికారి అశోక్‌కుమార్‌పో, అసిస్టెంట్ సెక్యూరిటీ మేనేజర్ చందన్ మహంతి, అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రశాంత్‌కుమార్ మండల్ తదితరులు పాల్గొన్నారు.

భాజపా విజయోత్సవాలు



హరియాణాలో జరిగిన ఎన్నికల్లో తమ పార్టీ ఘన విజయం సాధించిందని, జమ్మూకశ్మీరులో మంచి ఫలితాలు వచ్చాయని భాజపా గంజాం జిల్లా నాయకులు పేర్కొన్నారు. ఆయా రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వెల్లడైన అనంతరం మంగళవారం రాత్రి కోర్టుపేట కూడలిలో విజయోత్సవాలు జరుపుకున్నారు. భాజపా నాయకులు కన్హుచరణ పతి, రామ్‌కుమార్ పాత్ర్ తదితరులు పాల్గొని ప్రజలకు మిఠాయిలు పంచిపెట్టారు. – న్యూస్‌టుడే, బ్రహ్మపుర నగరం

రహదారి ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదంలో ఓ విద్యార్థి మృతి చెందిన ఘటన గుసాని సమితిలో చోటు చేసుకుంది. ఏఎస్సై సుశాంత్‌దొళాయి తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకుళం జిల్లా పాతపట్నం మేజర్ పంచాయతీ యశోదనగర్‌కు చెందిన ఎ.సోహిత్(19) దుర్గమ్మ కాలనీ వాసి పి.రాహుల్ సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో బీటెక్ చదువుతున్నారు. బుధవారం కళాశాల నుంచి ఇంటికి వెళ్తున్న సమయంలో పాటికోట గ్రామం వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పింది. చోదకుడు సోహిత్ ఘటనా స్థలంలోనే మృతి చెందగా స్నేహితుడికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు జిల్లా ప్రధానాసుపత్రికి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎయిర్ ప్రెషర్ ట్యాంక్ పేలి ఒకని మృతి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఖుర్దా చేరువలోని 16వ నెంబరు రహదారి దొలైపుట్ కూడలి వద్ద గల ఎయిర్ ప్రెషర్ గ్యారేజీలో ప్రెషర్ ట్యాంకు పేలుడు ఘటనలో యజమాని నబకిశోర్ బొరాల్ (54) మృతిచెందారు. అక్కడున్న మరో ఇద్దరు గాయపడ్డారు. ఒక వాహనానికి గాలి కొడుతున్న సమయంలో పెద్ద శబ్దంతో ప్రెషర్ ట్యాంకు పేలింది. ఇక్కడున్న బొరాల్ శరీరం ఛిద్రమైంది. ఘటనా స్థలంలో ఉన్న ఇద్దరు వాహనచోదకులు గాయపడ్డారు. ఖుర్దా సదరు పోలీసులు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్ లీక్ ఘటనలో మరొకరి ...

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా ఎలమంచిలి మండలం లైనుకొత్తూరు పరిధిలోని ఫ్యూజన్ ఇటుకుల పరిశ్రమలో గ్యాస్ లీకైన ఘటనలో మరొకరు మృతి చెందారు. ఈ పరిశ్రమలో శనివారం చోటుచేసుకున్న ప్రమాదంలో అదేరోజు ఒకరు మృతి చెందగా, కేజీహెచ్‌లో మరో ఇద్దరు చికిత్స పొందుతున్నారు. వీరిలో ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా సుహని గ్రామానికి మోలి లోక్‌నాథ్ (27) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్సై ఉపేంద్ర తెలిపారు.

బైక్ దొంగకు ఏడాది జైలు శిక్ష

రాయగడ గ్రామీణం,న్యూస్‌టుడే; బైక్ దొంగతనం కేసులో అరెస్టయిన నిందితుడు ప్రదీప్ జెనా నేరం రుజువు కావడంతో కొలనార గ్రామీణ కోర్టు న్యాయమూర్తి జోతిర్మయి షడంగి ఏడాది జైలు శిక్ష, రూ. 6వేలు జరిమాన విధించారు. 2013 డిసెంబరు 31వ తేదీన గౌడోకిలబడిలో బెనుధర కొంటబంసికి చెందిన ద్విచక్రవాహనం చోరి జరిగింది. . దీనిపై మంగళవారం కోర్టులో విచారణ చేసి న్యాయామూర్తి షడంగి తీర్పు వెల్లడించారు.

ధినేశ్వర్ కన్నుమూత



ధినేశ్వర్‌మాఝి (పాతచిత్రం)

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాజ్యసభ మాజీ ఎంపీ ధినేశ్వర్ మాఝి (84) బుధవారం కలహండి జిల్లా కెసింగ ఆసుపత్రిలో చివరి శ్వాస విడిచారు. అస్వస్థతకు గురైన ఆయన కొన్నాళ్లుగా చికిత్స పొందుతున్నారు. గతంలో నర్లా, కెసింగ స్థానాల నుంచి శాసనసభకు అయిదుసార్లు ప్రాతినిధ్యం వహించిన మాఝి కలహండి జిల్లాకు ఎనలేని సేవలు చేశారు. గిరిజన హితం ధ్యేయంగా పనులు చేశారు. ఆయన మృతిపట్ల గవర్నరు రఘుబర్‌దాస్, ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి, విపక్షనేత నవీన్‌పట్నాయక్ తదితర ప్రముఖులు సంతాపం తెలిపారు.

కుప్పకూలిన పైకప్పు.. ముగ్గురికి గాయాలు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఢెంకనాల్ జిల్లా కేంద్రంలోని మహిషాపట వద్ద నిర్మాణంలో ఉన్న హోటలు భవనం పైకప్పు బుధవారం సాయంత్రం కుప్పకూలింది. ఇక్కడ పనులు చేస్తున్న ముగ్గురు గాయపడినట్లు ప్రాథమికంగా తెలిసింది. పోలీసుల ఆధ్వర్యంలో సహాయ కార్యక్రమాలు జరిగాయి.

100 కిలోల గంజాయి స్వాధీనం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసుల అరెస్టు చేశారు. నందపూర్ ఎస్‌డీపీఓ సంబిత్‌కుమార్ మాఝి అందించిన వివరాల ప్రకారం నందపూర్ పోలీసుల మంగళవారం రాత్రి తనిఖీలు చేస్తుండగా జోలాపుట్ ప్రాంతం నుంచి గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందింది. గేరుపుట్ కూడలి వద్ద సోదాలు నిర్వహిస్తుండగా అతి వేగంగా పికప్ వ్యాను ఆగకుండా వెళ్లిపోయింది. వాహనాన్ని వెంబడించి నందపూర్ కళాశాల వద్ద అడ్డగించి వ్యానులో పరిశీలించారు. 100 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. గంజాయిని జోలాపుట్ ప్రాంతం నుంచి ఆంధ్రాకు తరలిస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.

పార్టీలకతీతంగా గంజాం జిల్లా అభివృద్ధికి కృషి చేద్దాం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: పార్టీలకతీతంగా గంజాం జిల్లా అభివృద్ధికి కృషి చేద్దామని అతిథులు అన్నారు. గంజాం జిల్లా పరిషత్ (జడ్పీ) 6వ సమావేశం బుధవారం జరిగింది. జిల్లా కేంద్రం ఛత్రపురంలోని రుషికుల్యా సమావేశ మందిరంలో నిర్వహించిన దీనికి జడ్పీ అధ్యక్షురాలు అంజలి స్వైయిన్ అధ్యక్షత వహించారు. అతిథులుగా రాష్ట్ర ఉక్కు, గనులు, రవాణా శాఖ మంత్రి బిభూతి భూషణ్ జెనా, పశు సంవర్ధక శాఖ మంత్రి గోకులానంద మల్లిక్, బ్రహ్మపుర ఎంపీ ప్రదీప్ కుమార్ పాణిగ్రాహి, అస్కా ఎంపీ అనితా శుభదర్శిని, పలువురు శాసనసభ్యులు పాల్గొని మాట్లాడారు.

పాలకొండలో సినీ సందడి

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: కోటదుర్గమ్మ సన్నిధిలో ఎంత పనిచేసావ్ చంటి.. సినిమా పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. నూతన నటీనటులతో నిర్మించిన ఈ కార్యక్రమం కాస్టింగ్ డైరెక్టర్ ఎస్. మధు ఆధ్వర్యంలో జరిగింది. కోటదుర్గమ్మ దసరా ఉత్సవ కమిటీ సభ్యులు గంటా సంతోష్, రుద్రకోటేశ్వరరావు, సంతోష్‌కుమార్, చిన్నశ్రీను, కె. యోగిత, గుప్తా, వెంకటరమణ, జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు జి.సత్తిబాబు పాల్గొన్నారు.

ఎస్టీ కమిషన్ ఛైర్మన్ పర్యటన

శంబర(మక్కువ), న్యూస్‌టుడే: శంబర పీహెచ్‌సీలో గర్భిణులకు రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డీవీజీ శంకరరావు పోషకాహార పొట్లాలు అందజేశారు. బుధవారం శంబరలో పర్యటించిన ఆయన ఇటీవల మృతి చెందిన మావుడి మాజీ సర్పంచి తిరుపతిరావు తండ్రి సూర్యనారాయణ కుటుంబాన్ని పరామర్శించారు. ఎంపీటీసీ సభ్యుడు పోలినాయుడు, నాయకులు బుచ్చినాయుడు ఉన్నారు.

జ్ఞాన సరస్వతి ఒడిలో పాఠాలు

అక్షరాభ్యాసాలకు తరలివచ్చిన భక్తులు

విజయనగరంలోని రింగురోడ్డు ఎస్వీయన్‌నగర్‌లో కొలువుదీరిన జ్ఞాన సరస్వతీ ఆలయంలో మూలానక్షత్రం సందర్భంగా బుధవారం అక్షరాభ్యాసాల కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. ముందుగా సరస్వతి, మహాలక్ష్మి, భువనేశ్వరీదేవిలకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం విశేషాలంకరణ చేపట్టారు. ఈ సందర్భంగా 4 వేల మంది చిన్నారులు తమ తల్లిదండ్రుల ఒడిలో కూర్చొని పలకలపై బలపాలతో అక్షరాలు దిద్దారు. తులాభార సేవలో సందడిగా పాల్గొన్నారు. ఉదయం నుంచి 10 విడతలుగా నిర్వహించామని శారదా సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చెరుకూరి శ్రీధర్, జి.శ్రీనివాసరావు తెలిపారు. భక్తులకు ఉదయం ఫలహారం, మధ్యాహ్నం భోజన సౌకర్యం కల్పించామని చెప్పారు.

– న్యూస్‌టుడే, విజయనగరం కంటోన్మెంట్





చిన్నారులతో అక్షరాలు రాయిస్తున్న తల్లిదండ్రులు (అంతర్ చిత్రంలో) పుష్పాలంకరణలో సరస్వతీదేవి, మహాలక్ష్మి, భువనేశ్వరిదేవీ

మొక్కల వెనుక ఉందో భవనం!

ఇచ్ఛాపురం పురపాలక సంఘ పరిధిలో సుమారు 18 ఏళ్ల కిందట 20 చోట్ల ఎంపీ నిధులతో సామాజిక భవనాలు నిర్మించారు. పలుచోట్ల వినియోగిస్తుండగా సంతపేట వద్ద నిరుపయోగంగా ఉంది. గతంలో దీనిని ట్రాక్టర్ యూనియన్‌కు కేటాయించారు. ప్రస్తుతం చుట్టూ పనికి రాని మొక్కలు పెరిగిపోయాయి. బస్సు ప్రయాణికుల వసతికి లేదా మహిళా సంఘాల సమావేశ మందిరంగా ఉపయోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని పుర కమిషనరు నల్లి రమేష్ తెలిపారు.

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం



బావి కాదు.. కుళాయి!



ఇచ్ఛాపురం పట్టణం ఉప్పాడ వీధి సమీపంలోని కుళాయి నుంచి ఇళ్లకు నీరు తీసుకెళ్లడానికి మహిళలు ఇబ్బంది పడుతున్నారు. చాలా ప్రాంతాల్లో రోజూ కుళాయి నీరు ఇళ్లకే వస్తోందని.. ఇక్కడ కుండీలో నిండిన నీటిని బకెట్‌తో తోడుకుని తీసుకెళ్లడానికి అవస్థలు తప్పడం లేదని వాపోతున్నారు. రూ.58 కోట్ల వ్యయంతో చేపట్టిన రక్షిత నీటి పథకం పూర్తయితే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని పుర కమిషనర్ రమేష్ తెలిపారు.

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం, సోంపేట

ఒకప్పుడు దసరా వచ్చిందంటే కంచిలి కొబ్బరి మార్కెట్ కళకళలాడేది. వందల మంది కార్మికులు పనుల్లో నిమగ్నమయ్యే వారు. తోటల్లో పండగ వాతావరణం ఉండేది. ప్రకృతి వైపరీత్యాలు, వర్షాభావ పరిస్థితులు, ఎర్రనల్లి, తెల్లదోమ వంటి తెగుళ్ల బెడద ఆశించడం తదితర కారణాలతో ప్రస్తుతం దిగుబడి గణనీయంగా తగ్గిపోతోంది. ఫలితంగా కొబ్బరి మార్కెట్‌కు కళ తప్పడంతో కార్మికులకు ఉపాధి లేక వలస బాట పడుతున్నారు.



కొబ్బరి కాయల తొక్కలు తీస్తున్న కార్మికులు

నాడు కళకళ.. నేడు వెలవెల!

వైభవం కోల్పోయిన కంచిలి కొబ్బరి మార్కెట్

● ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట, మందస, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో సుమారు 30 వేల ఎకరాల్లో కొబ్బరి సాగు చేస్తున్నారు. గతంలో ఈ ప్రాంతాల్లో దిగుబడి అయిన కాయలు కంచిలి మార్కెట్‌కు చేరుకునేవి. ఇక్కడి నుంచి బిహార్, బెంగాల్, ఒడిశా, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి అయ్యేవి. ఉత్తరాది రాష్ట్రాల వర్తకుల డిమాండ్ మేరకు ఏడాది పొడవునా లారీల్లో కాయలు వెళ్లేవి. దసరా ఉత్సవాల సమయంలో ఎక్కువ ఆర్డర్లు ఉండేవి. దీపావళి అనంతరం బిహార్‌లో నిర్వహించే పండగకు రోజుకు 10 లారీలకు తగ్గకుండా వెళ్లేవి. ఆ సమయంలో విపరీతమైన గిరాకీ ఉండడంతో రైతులు అధిక ధరలు పొందేవారు.

ఇదీ పరిస్థితి

1999లో సంభవించిన తుపాను తరువాత కొబ్బరి రైతులు కుదేలయ్యారు. చెట్లకు ఎర్రనల్లి ఆశించడంతో కాయల పరిమాణం తగ్గిపోయింది. వ్యాపారులు గ్రేడింగ్ విధానం అమలులోకి తేవడంతో కష్టాలు మొదలయ్యాయి. అప్పటి నుంచి వరుసగా ప్రకృతి వైపరీత్యాలు సంభవించడంతో దిగుబడి, కాయల పరిమాణం తగ్గి ఉత్తరాది రాష్ట్రాల నుంచి ఆర్డర్లు క్షీణించాయి. 2018లో సంభవించిన తిత్లీ తుపాను ప్రభావంతో వజ్రపుకొత్తూరు, మందస మండలాల్లో 90 శాతం చెట్లు, ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 50 శాతం కొబ్బరి చెట్లు నేలకొరిగాయి. ఈ కారణంగా కంచిలి మార్కెట్ స్వరూపం మారిపోయింది. అప్పటి నుంచి ఒడిశాకు చెందిన చిన్న వర్తకులు నేరుగా రైతుల నుంచి కొబ్బరి కాయలు కొనుగోలు చేస్తున్నారు.

● ప్రస్తుతం దసరా ఉత్సవాల సమయంలోనూ రోజుకు లారీ కాయలు ఎగుమతి చేయడం గగనంగా మారింది. కంచిలి కొబ్బరి కార్మిక సంఘం లెక్కల ప్రకారం గతంలో 750 మంది కార్మికులు ఉండగా 150 మంది పని చేస్తున్నారు. గ్రామంలో పరిశ్రమ దీనిపై ఆధారపడిన వందల మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు.

రైతుల్ని ఆదుకుంటాం..

తెగుళ్ల బారి నుంచి కొబ్బరి తోటల్ని కాపాడుకోవడంపై రైతులకు అవగాహన కల్పించాలని ఉద్యాన శాఖ అధికారులను ఆదేశించాం. కర్షకులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. కొబ్బరి బోర్డు, పరిశోధ కేంద్రాల ఏర్పాటుపై అధికారులతో చర్చిస్తాం. వ్యవసాయ శాఖ మంత్రిని కలిసి వినతిపత్రం అందజేస్తాం.

– బెందాళం అశోక్, ఎమ్మెల్యే, ఇచ్ఛాపురం

పరిశోధన కేంద్రం ఏర్పాటు చేస్తే మేలు

కేరళ తరహాలో ఉద్దానంలో కొబ్బరి బోర్డు ఏర్పాటు చేయాలి. దీని ఆధ్వర్యంలో క్రయవిక్రయాలు జరగాలి. ఈ ప్రాంతంలో కొబ్బరి పరిశోధన కేంద్రం ఏర్పాటు చేసి రైతుల్ని ఆదుకోవాలి. ఉత్పత్తులకు గిరాకీ పెరిగి పూర్వ వైభవం వస్తుంది.

– కప్ప గోపీనాథ్, సీఐటీయూ మండల అధ్యక్షుడు, కంచిలి

పంచ శైవక్షేత్ర దర్శనాలకు ప్రత్యేక బస్సులు

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: కార్తిక మాసం సమీపిస్తుండడంతో ఉమ్మడి జిల్లాలో ఉన్న శైవక్షేత్రాలు దర్శించుకోవడానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు పార్వతీపురం డిపో మేనేజర్ దుర్గ ఒక ప్రకటనలో చెప్పారు. పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలోని గుంప సోమేశ్వరాలయం, అడ్డాపుశిల కాశీవిశ్వేశ్వరస్వామి, నారాయణపురం నీలకంఠేశ్వరస్వామి, సంగం సంగమేశ్వర స్వామి, తోటపల్లిలోని ఆలయాలు ఒక్క రోజులో భక్తులు దర్శించుకునేలా బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. నవంబరు 4, 11, 18, 25 తేదీల్లో సర్వీసులు నడుస్తాయని వెల్లడించారు. 'పల్లె వెలుగు' సర్వీసుకు ఒక్కొక్కరికి రూ.350 ఛార్జీ ఉంటుందన్నారు. బస్సు బుక్ చేసుకునే అవకాశం ఉందన్నారు. apsrtconline.in వెబ్‌సైట్ ద్వారా, గుర్తింపు పొందిన ఏజెంట్ల వద్ద, ముందుగా రిజర్వేషన్ చేసుకునే అవకాశం ఉందన్నారు. 73828 34904, 90001 01080 నంబర్లకు సంప్రదించి రిజర్వేషన్ చేసుకునే సౌలభ్యం ఉందని వెల్లడించారు.

ఒరుగుతూ..భయపెడుతూ



ఇచ్ఛాపురం పట్టణం కండ్ర కాలనీలో రెండు విద్యుత్తు స్తంభాలు ఒరిగిపోతూ స్థానికులను భయాందోళనలకు గురి చేస్తున్నాయి. రక్షణ తీగ లేకపోవడం.. స్తంభాలను లోతుగా పాతకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందని కాలనీ వాసులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఏఈ గోవిందరావు తెలిపారు.

–న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

తొలగని ఆటంకాలు.. పూర్తికాని నిర్మాణాలు

20 నెలలుగా మూలుగుతున్న చీపురుపల్లి వంతెన పనులు

న్యూస్‌టుడే, చీపురుపల్లి



నిలిచిన కాంక్రీటు గోడ నిర్మాణ పనులు

ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశాకు ప్రధాన మార్గమైన విజయనగరం - పాలకొండ రహదారిలో చీపురుపల్లి వద్ద ఆర్వోబీ నిర్మాణాలకు ఆటంకాలు తొలగకపోవడంతో పనులు ముందుకు సాగడంలేదు. పురాతన కాలంలో నిర్మించిన వంతెన శిథిలావస్థలకు చేరుకోవడంతో రెండున్నర ఏళ్ల కిందట భారీ వాహనాల రాకపోకలను నిషేధించారు. 2022 ఆగస్టు 16న వంతెన నిర్మాణానికి కేంద్ర రైల్వే బోర్డు రూ.12.97 కోట్లు నిధులు మంజూరు చేయడంతో.. గతేడాది మార్చిలో పనులను ప్రారంభించారు. 20 నెలలు గడుస్తున్నా.. పనులు పూర్తికాని దుస్థితి. దాంతో అత్యవసర సమయాల్లో ప్రజలు నానా యాతన పడాల్సివస్తోంది.

సర్వీసు రహదారి రగడ..

వంతెన నిర్మాణానికి సంబంధించి చీపురుపల్లి వైపు సిమెంట్ కాంక్రీటు పనులు జరుగుతుండగా.. గత నెల స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. గోడ నిర్మిస్తే కొత్తఅగ్రహారం, రిక్షాకాలనీతో పాటు పలు గ్రామాలకు రాకపోకలకు మార్గం ఉండదని, సర్వీసు రహదారి సదుపాయం కల్పించాలంటూ ఆందోళన వ్యక్తం చేయడంతో పనులు నిలిపేశారు. సర్వీసు రహదారి సదుపాయం కల్పించడానికి.. రోడ్డుకు ఆనుకుని ఉన్న దుకాణాలను కొంత వరకు కొట్టాల్సిఉందని అధికారులు అంటున్నారు. ర.భ, రైల్వే అధికారులు కొద్ది రోజుల కిందట పరిశీలించి మార్కింగ్ ఇచ్చారు. తొలగించాలని యజమానులకు సూచించారు. వంతెనకు సంబంధించి మిగతా పనులు జరుగుతున్నా.. కీలకమైన కాంక్రీట్ గోడ నిర్మాణం నిలిచిపోవడంతో దీని ప్రభావం మొత్తం పనిపై పడే అవకాశముందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

త్వరితగతిన పూర్తయ్యేలా చూస్తాం..

ఆర్వోబీ నిర్మాణ పనులు చురుగ్గా జరిగేలా చూస్తాం. సర్వీసు రహదారి నిర్మాణానికి దుకాణాలను కొంతవరకు తొలగించాలని యజమానులకు ర.భ. అధికారులు, గుత్తేదారుని ప్రతినిధులు సూచించారు. ర.భ. డీఈ సమక్షంలో తాము పనులు చేయిస్తామని గుత్తేదారుడు అంటున్నారు. డీఈతో మాట్లాడి పనులు జరిగేలా చూస్తాం.

– ఎల్.దామోదరరావు, ఎస్సై, చీపురుపల్లి

సగం పనులతో ఆపేశారు!



మందస మండలం కొండలోగాం క్లస్టర్ గ్రామ సచివాలయం భవన నిర్మాణ పనులు రెండేళ్ల కిందట ప్రారంభించి అసంపూర్తిగా ఆపేశారు. ఏడాది గడిచినా పురోగతి లేదని.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. నిర్మించిన మేరకు బిల్లులు మంజూరు చేయలేదని.. నిధులు సమకూరగానే పనులు ప్రారంభిస్తామని సర్పంచి రోజా తెలిపారు.

– న్యూస్‌టుడే, హరిపురం (మందస)

ఆనందోత్సాహం

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండలో కోటదుర్గమ్మ, వివిధ అమ్మవార్ల దసరా ఉత్సవ సందడి వీధివీధినా నెలకొంది. నృత్యప్రదర్శనలతో పట్టణమంతా బుధవారం సందడి నెలకొంది. మొదటిసారిగా ఒడిశాకు చెందిన బృందంతో ఏర్పాటుచేసిన బాజా వాయిద్య ప్రదర్శన ఆకట్టుకుంది.

జ్ఞాన సరస్వతికి ప్రత్యేక పూజలు

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: సరస్వతీ పూజ సందర్భంగా పాలకొండ జ్ఞాన సరస్వతీ ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని హంస వాహనంపై ప్రత్యేకంగా అలంకరించారు.

గుచ్చిమిలోనే ఏనుగుల గుంపు

గ్రామీణులు జాగ్రత్తలు పాటించాలి: డీఎఫ్‌వో



ఏనుగుల విషయమై రేంజ్ అధికారులతో మాట్లాడుతున్న డీఎఫ్‌వో

పార్వతీపురం గ్రామీణం/సీతానగరం, న్యూస్‌టుడే: పార్వతీపురం అటవీశాఖ పరిధిలో ఏనుగులు సంచరించే ప్రాంతాల ప్రజలు జాగ్రత్తలు పాటించాలని డీఎఫ్‌వో జీఏపీ ప్రసూన కోరారు. బుధవారం మండలంలోని పులిగుమ్మి, సీతానగరం మండలం గుచ్చిమి ప్రాంతాల్లో గజరాజులు తిరుగుతున్న ప్రాంతాలను ఆమె పరిశీలించారు. గుచ్చిమి కొండను అనుసరించి ఉన్న మామిడితోటల్లోనే మూడు రోజులుగా ఏడు ఏనుగుల గుంపు సంచరిస్తూ.. గుచ్చిమి, తాన్నసీతారాంపురం, సూరంపేట గ్రామ పరిసరాల్లోనే బస చేస్తున్నాయన్నారు. అవి గ్రామాలవైపు వెళ్లకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వాటివల్ల జరిగే నష్టాలకు స్థానిక వీఆర్వోలతో కలిసి వెంటనే అంచనాలు వేయాలని ఏనుగుల పర్యవేక్షణ రేంజర్ మణికంఠేష్, ఫారెస్టర్ మనోజ్‌లను ఆదేశించారు. కుంకీ ఏనుగుల సంరక్షణ కేంద్రం ఏర్పాటుచేసే ప్రాంతాల్లో త్వరలో పనులు మొదలవుతాయన్నారు. గ్రామ పరిసరాల్లోకి ఏనుగులు వస్తే వాటిని కవ్వించకుండా.. తమ సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు. సాయంత్రం 6 నుంచి ఉదయం 6 గంటల వరకు ఒంటరిగా తిరగవద్దని డీఎఫ్‌వో ప్రసూన సూచించారు.

ఫర్నీచర్ దొంగలపై చర్యలకు డిమాండ్

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సాలూరు పురపాలిక పరిధిలోని శానిటేషన్ సెక్షన్ అతిథి గదిలో 2013లో ఏర్పాటు చేసిన ఫర్నీచర్ దొంగిలించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సాలూరు మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు ఆధ్వర్యంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రాజీవ్‌కు వినతి అందించారు. ఫర్నీచర్ దొంగిలించిన ఘటనపై కలెక్టర్, కమిషనర్ దర్యాప్తు చేసి, దోషులను కఠినంగా శిక్షించాలన్నారు.

చినుకు పడితే చెరువే..

కంచిలిలో వర్షం పడితే కంచమ్మతల్లి ఆలయ ముఖద్వారం నుంచి ఎస్‌బీఐ వరకు రహదారిపై గుంతల్లో నీరు చేరి చెరువులా మారుతోంది. వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. వాహనాలు వెళ్తున్నపుడు సమీపంలో ఉన్న వారిపై బురద నీరు పడుతుండటంతో అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఏఈ మోహనరావును 'న్యూస్‌టుడే' సంప్రదించగా త్వరలోనే రహదారి నిర్మాణం పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

– న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం



ఏబీ రోడ్డులో ప్రయాణం నరకం

పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాలతో పాటు ఒడిశా రాష్ట్రానికి వెళ్లేందుకు కీలక మార్గంగా ఉన్న భామిని మండలంలోని అలికాం-బత్తిలి(ఏబీ) రోడ్డు అధ్వానంగా దర్శనమిస్తోంది. కొరమ బగ్గామర్రిపాడు గెడ్డ నుంచి బత్తిలి వరకు సుమారు 27 కి.మీ. మేర ఈ మార్గం విస్తరించి ఉంది. ఏళ్ల క్రితం నిర్మించినది కావడంతో భారీ గుంతలు ఏర్పడ్డాయి. గత అయిదేళ్లలో నాటి వైకాపా ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడంతో నేటికీ ఆ కష్టాలు వెంటాడుతున్నాయి. మంగళవారం పెద్దదిమిలి సమీపంలో భారీ వాహనం కూరుకుపోయింది. వంశధార నదిలో ఇసుక తవ్వకాలకు ఒడిశా అనుమతులు ఇవ్వడంతో ఇటుగా లారీల రాకపోకలు పెరిగాయి. దీంతో ఈ రహదారిలో ప్రయాణాలు నరకప్రాయంగా మారాయి.

– న్యూస్‌టుడే, భామిని



కూరుకుపోయిన ఇసుక లారీ

మలేరియా, డెంగీలపై అప్రమత్తం

పార్వతీపురం, న్యూస్‌టుడే: జిల్లాలో మలేరియా, డెంగీ వ్యాధులు ప్రబలకుండా వైద్య, ఆరోగ్యశాఖ యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టరు శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. బుధవారం వైద్య, ఆరోగ్యశాఖ పనితీరుపై ఆయన సమీక్షించారు. రక్తహీనత రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు బాలికలు, యువతులకు రక్తపరీక్షలు నిర్వహించి, వారికి సరైన పోషక ఆహారాన్ని అందేలా చూడాలన్నారు. గర్భిణులకు వైద్యపరీక్షలు ఎప్పటికప్పుడు చేపట్టి, వారి ఆరోగ్యంపై శ్రద్ధ చూపించాలన్నారు. మాతాశిశు మరణాలు జిల్లాలో నమోదు కాకుండా క్షేత్రస్థాయి నుంచే కట్టుదిట్టంగా పనిచేయాలని తెలిపారు. సికిల్ సెల్ ఎనీమియా బాధితులకు కార్డుల పంపిణీ పూర్తి చేయాలని కలెక్టరు సూచించారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రసూతి సేవల పరిశీలనకు కమిటీని వేసి, పర్యవేక్షణను పెంచాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు, ఆసుపత్రుల ప్రధాన వైద్యాధికారులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ సంక్షేమాలపై ఆరా



వేతనదారులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

పాచిపెంట, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై కేంద్ర బృందం లబ్ధిదారులకు మాట్లాడారు. మండలంలోని పద్మాపురం, మిర్తివలస గ్రామాల్లో బుధవారం పర్యటించారు. ఉపాధి హామీ, పింఛన్లు, గృహ నిర్మాణం, స్వమిత్రా, జల్‌జీవన్ పథకాలు అమలు గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పాచిపెంట నుంచి ఎగువ కుమ్మరివలస వరకు రూ.3.60 కోట్లు ఉపాధి నిధులతో చేపడుతున్న బీటీ రహదారి పనులు పరిశీలించారు. కేంద్ర బృంద సభ్యులు కెజీ సలీమ్ కుమార్, ఎంకే.శశి అప్తన్‌తోపాటు ఏపీడీ రమేష్, ఎంపీడీవో పాత్రో పాల్గొన్నారు.

న్యూస్‌టుడే, కాశీబుగ్గ

పలాస జీడిపప్పునకు పండగ శోభ వచ్చింది.. వచ్చే దసరా, దీపావళి నేపథ్యంలో ఎగుమతులు ఊపందుకున్నాయి. ఇదే సమయంలో డిమాండ్‌తో పాటు ధరలు కూడా పెరిగాయి. మరోపక్క కార్మికులకు చేతినిండా పని దొరికింది.




పలాస జీడికి.. పండగే పండగ!



పప్పు శ్రేణీకరణ చేస్తున్న కార్మికులు

భారీగా పెరిగిన పప్పు ఎగుమతులు

రెండు నెలల్లో ధరల తేడాను గమనిస్తే.. (రూ..లలో)



ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి..

పలాస జీడిపప్పు దక్షిణ రాష్ట్రాల కంటే ఉత్తరాది రాష్ట్రాలకే అధికశాతం ఎగుమతి అవుతుంది. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, బిహార్, ఝార్ఖండ్, రాజస్థాన్, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో దసరా, దీపావళి పండగల్లో జీడి పప్పు వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో అక్టోబరులో ఎగుమతులు అందుకు తగ్గట్టుగానే ఉంటాయి. దీంతో కార్మికులకు చేతి నిండా పని ఉంటుంది. రాత్రీపగలూ పనిచేస్తారు. ఒక్క జీడి పరిశ్రమల్లో పనిచేసే వారే కాక వీటిపై ప్రత్యక్ష, పరోక్షంగా ఆధారపడి జీవనం సాగిస్తున్న కార్మికులకు సైతం ఖాళీ ఉండదు. వర్తకులు సైతం ఏడాదిలో జరిగే వ్యాపారం కంటే ఈ నెల రోజుల వ్యాపారంపైనే ఆశలు పెట్టుకుంటారు. జిల్లాలో దాదాపు 370 జీడి పప్పు తయారీ కర్మాగారాలుండగా పలాస నియోజకవర్గం పరిధిలో 300 వరకు ఉన్నాయి. వీటి ద్వారా రోజుకు సగటున వంద టన్నుల వరకు జీడి పప్పు ఉత్పత్తి జరుగుతుంది. ఇందులో 60 శాతం వరకు ఉత్తరాది రాష్ట్రాలకే ఎగుమతి అవుతోంది. రెండు నెలలు కాలంలో కిలో దగ్గర రూ.80 నుంచి రూ.100 వరకు ధర పెరిగింది.

అభివృద్ధే లక్ష్యంగా పనిచేద్దాం..



బంజ్‌దేవ్‌ను సత్కరిస్తున్న జనసేన నాయకులు

సాలూరు గ్రామీణం, మక్కువ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధే లక్ష్యంగా పనిచేద్దామని మాజీ ఎమ్మెల్యే ఆర్‌పీ బంజ్‌దేవ్ అన్నారు. బుధవారం సాలూరు పట్టణంలో ఇటీవల వైకాపా నుంచి జనసేన పార్టీలో చేరిన సూరిబాబు, ఈశ్వరరావు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.